విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell:9247819181, 8309605189



TITLE Code TEL TEL12230

# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA





హైదరాబాద్,కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల | మంగళ వారం 4 జూన్ 2024 | పేజీలు : 4 వెల : రూ.2


## విజయవంతమైన ఎన్నికల నిర్వహణ !

- ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యానికి పుట్టం కడుతున్న కాలం
- 04 జూన్ 2024న వెలువడి 18 లోకసభ ఏర్పడనుంది
- ఎన్నికల సిబ్బందికి ప్రతి దేశ పౌరుడు కృతజ్ఞతలు సమర్పించాల్సిందే




డెస్క్ మన వార్త : వైవిధ్యభరితం నా సువిశాల భారతం. భారత రాజ్యాంగంలోని ఆర్టికిల్ 83 ప్రకారం ప్రతి ఐదేళ్ల ఒకసారి లోకసభ సాధారణ ఎన్నికలు జరగాలి. నేడు ప్రభుత్వంలో ఉన్న నరేంద్ర మోదీ నాయకత్వ 17వ లోకసభ గడువు 16 జూన్ 2024న ముగియనుంది. భారతీయులు పర్వదినాలుగా భావించబడుతున్న సాధారణ ఎన్నికలు - 2024 జరుగుతున్న వేళలు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యానికి పుట్టం కడుతున్న కాలం. భారత లోకసభకు 543 మంది ఎంపీలను ఎన్నిక చేయడంలో 19 ఏప్రిల్ నుంచి 01 జూన్ 2024 వరకు ఏడు దఫాలుగా జరిగిన సాధారణ ఎన్నికల ఫలితాలు 04 జూన్ 2024న వెలువడి 18 లోకసభ ఏర్పడనుంది. ఈ సాధారణ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలో దాదాపు 40 పార్టీల ఎన్‌డిఏ కూటమి, కాంగ్రెస్ నేతృత్వంలో 26 పార్టీల ఇండియా కూటమి ప్రధానంగా పోటీ పడినప్పటికీ 6 జాతీయ పార్టీలతో పాటు 57 రాష్ట్ర పార్టీలు, 2,764 అధికార గుర్తింపులేని పార్టీలు ఎన్నికల్లో పాల్గొన్నాయి. భారత్‌లో ఎన్నికలను నిర్వహించడానికి స్వయంప్రతిపత్తి కలిగిన భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) నడుం బిగిస్తుంది. 2024 సాధారణ ఎన్నికల్లో దాదాపు 70 శాతం భారత జనాభా, అనగా 18 ఏండ్ల వయస్సు దాటిన 96.8 కోట్ల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే అర్హతను కలిగి ఉన్నారు. 2019లో నిర్వహించిన ఎన్నికలతో పోల్చితే నేడు 15 కోట్ల మంది ఓటర్లు అదనంగా ఓటు వేయనున్నారు. ఈ సాధారణ ఎన్నికలతో పాటు ఏపీ, అరుణాచల్, ఒడిసా, సిక్కిమ్ రాష్ట్రాల శాసన సభలకు, 25 ఎంఎల్ఏ స్థానాలకు ఉప ఎన్నికలు కూడా ఎన్నికలు జరుతున్న సందర్భం. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి 2 కిమీ లోపు పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలి. ఈ నిబంధన ప్రకారం ఒకే ఓటరు ఉన్న అరుణాచల్ మలోగామ్, ఒకే గుడి పూజారి ఓటరు ఉన్న గుజరాత్ గిర్ ఫారెస్టుల్లో కూడాపోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. అదే విధంగా కేరళ వన్యప్రాణ అభయారణ్యం, గుజరాత్‌లోకి షిప్పింగ్ కంటేనర్, మణిపూర్ అల్లరులలో స్థానభ్రంశం చెందిన 59,000 మందికి చెందిన 320 శరణార్థుల శిబిరాల్లో కూడా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసింది భారత ఎన్నికల కమీషన్. ఈ ఎన్నికల్లో దాదాపు 5.5 మిలియన్ల ఓటింగ్ మిషన్లు, ఒక మిలియన్ పోలింగ్ స్టేషన్లు, 15 మిలియన్ల ఎన్నికల సిబ్బంది ఈ సాధారణ ఎన్నికల యజ్ఞంలో పని చేసారు. ఈ ఎన్నికల్లో 85 ఏండ్లు దాటిన వృద్ధులు, అంగవైకల్య ఓటర్లకు తమ ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కూడా కల్పించారు. 2లో


## ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం



హైదరాబాద్ **మన వార్త** : తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. 17 నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు సహా 525 మంది పోటీలో ఉన్నారు. 2,20,24,806 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 120 హాళ్లలో 1855 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 2.18 లక్షల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 19 హాళ్లలో 276 టేబుల్స్ ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటల వరకు ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉంది. చొప్పదండి, దేవరకొండ, యాకుత్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్లలో 13 రౌండ్లలో లెక్కించనున్నారు. ఆర్మూరు, భద్రాచలం, అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్లలో 13 రౌండ్లలో లెక్కించనున్నారు. ఓట్ల లెక్కింపునకు సుమారు 10 వేల మంది సిబ్బంది పని చేయనున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా రేపు 144 సెక్షన్ విధించనున్నారు. మద్యం దుకాణాలను బంద్ చేయనున్నారు.


మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA
epaper
చదవడానికి QR కోడ్‌ను స్కాన్ చేయండి
http://manavaartha.net
MANA VAARTHA


## కవిత స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసిన ఈడీ



ఢిల్లీ **మన వార్త** : ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ సప్లిమెంటరీ చార్జ్‌షీట్‌లో కీలక అంశాలను రౌస్ అవెన్యూ కోర్టు ముందు ఉంచింది. లిక్కర్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై ఈడీ పలు అభియోగాలు మోపింది. ఈ కేసులో రూ.1100 కోట్ల వ్యాపారం జరిగిందని చార్జ్‌షీట్‌లో ఈడీ పేర్కొంది. రూ.192 కోట్ల లాభాలను ఇండో స్పిరిట్స్ పొందిందని తెలిపింది. రూ. 100 కోట్ల ముడుపులు ఆమ్ ఆద్మీ పార్టీకి ఇచ్చినట్లు చెప్పింది. కవిత డిజిటల్ ఆధారాలు ధ్వంసం చేసిందని ఈడీ పేర్కొంది. ఈడీ చార్జిషీట్‌లో కవిత స్టేట్‌మెంట్‌ను ఈడీ రికార్డ్ చేసింది. ఈ రికార్డులో లిక్కర్ కేసుకు సంబంధించి పలు సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. లిక్కర్ పాలసీ రూపకల్పనలో నా తరపున పాల్గొనాలని బుచ్చిబాబుకు నేను ఎలాంటి అథారైజేషన్ ఇవ్వలేదు. ఇండో స్పిరిట్‌లో ప్రత్యక్షంగా, పరోక్షంగా నాకు ఎలాంటి వాటాలేదని తెలిపింది. ఢిల్లీ లిక్కర్ వ్యాపారం గురించి నేను ఎవరితో మాట్లాడలేదు. బుచ్చిబాబు, రాఘవల మధ్య జరిగిన సంభాషణలు చూపిస్తే తనకు గుర్తులేదు, వాళ్ల నెంబర్లు కూడా తెల్వదు. కానీ వాళ్ల మధ్య చాటింగ్ జరిగిందని కవిత ఫోన్ రికార్డులు చూపిస్తున్నాయి. లిక్కర్ పాలసీ రూపకల్పన, లిక్కర్ వ్యాపారం నాకు ఎలాంటి సంబంధం లేదు, నా తరపున ఎవరు ఆప్ పార్టీ నేతలను సంప్రదించలేదు, లంచాలు ఇవ్వలేదు. అరుణ్ పిళ్ళై తన ఫ్యామిలీ ఫ్రెండ్, వారాంతాల్లో తరచూ కలుస్తుంటాం, బతుకమ్మ లాంటి పండుగలు కలిసి నిర్వహించామని కవిత తెలిపింది.

## తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో రూ. 200 కోట్లు సీజ్



హైదరాబాద్ **మన వార్త** : తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు మే 13వ తేదీన ఎన్నికలు ప్రశాంతంగా జరిగిన సంగతి తెలిసిందే. ఫలితాలు జూన్ 4వ తేదీన వెల్లడి కానున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి మార్చి 16వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. నాటి నుంచి నేటి వరకు తెలంగాణ వ్యాప్తంగా రూ. 200 కోట్ల విలువ చేసే నగదు, మద్యం, విలువైన ఆభరణాలు, నార్కోటిక్ డ్రగ్స్‌ను సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఈ నెల 6వ తేదీ వరకు అమల్లో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. రూ. 99.16 కోట్ల నగదు, రూ. 11.48 కోట్ల విలువ చేసే మద్యం, రూ. 14.52 కోట్ల విలువ చేసే నార్కోటిక్ డ్రగ్స్, రూ. 63.19 కోట్ల విలువ చేసే ఆభరణాలు(92.271 కిలోల బంగారం, 178.657 కిలోల వెండి), రూ. 11.91 కోట్ల విలువ చేసే ఇతర వస్తువులను సీజ్ చేశారు. 2019 ఎన్నికల్లో కేవలం 46.3 కోట్ల విలువ చేసే నగదు, ఆభరణాలు, మద్యం సీజ్ చేశారు. ఇప్పుడు ఆ సంఖ్య మూడింతలు పెరిగింది.

## కోతల్లేని కరెంట్ ఇవ్వలేరు



హైదరాబాద్ మన వార్త : నల్గొండ మున్సిపాలిటీలోని పాతబస్తీ హిందూపూర్ వాటర్ ట్యాంకర్‌లో మృతదేహం లభించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ట్విట్టర్ (ఎక్స్) వేదికగా నిప్పులు చెరిగారు. ఇది ప్రజా పాలన కాదు.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే పాలన అని విమర్శించారు. కోతల్లేని కరెంట్ ఇవ్వలేరు.. కోతకొచ్చిన పంటకు సాగునీళ్లు ఇవ్వలేరు.. కోతులు వడి చనిపోయినా వాటర్ ట్యాంకులను పట్టించుకోరని కేటీఆర్ అన్నారు. చివరికి.. నల్గొండలోని నీటిట్యాంకులో పదిరోజులుగా శవం ఉన్నా నిద్రలేవరని మండిపడ్డారు. సాగర్ ఘటన స్మృతిపథం నుంచి చెరిగిపోకముందే.. కాంగ్రెస్ సర్కారులో మళ్లీ అదే నిర్లక్ష్యం.. అదే నిర్లిప్తత.. కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సురక్షిత మంచినీళ్లు కూడా ఇవ్వలేని సర్కారిది ప్రజారోగ్యాన్ని పూర్తిగా గాలికొదిలేసిన గలీజు పాలన ఇది అని ఎద్దేవా చేశారు. మిషన్ భగీరథ పథకంతో.. దశాబ్దాల తాగునీటి తండ్లాటను తీరిస్తే.. కనీసం నీటిట్యాంకుల నిర్వహణ కూడా చేతకాని అసమర్థ ప్రభుత్వమిది అని విమర్శించారు. జలమే జగతికి మూలం అని గుర్తుంచుకోండి అని తెలిపారు. ఈ సర్కారు తీరు మారకపోతే జనమే కాంగ్రెస్ ను తరిమికొట్టడం ఖాయమని స్పష్టం చేశారు.

# విజయవంతమైన ఎన్నికల నిర్వహణ !





భారత ప్రభుత్వ సాధారణ ఎన్నికలు 19 ఏప్రిల్ నుంచి 01 జూన్ 2024 వరకు 7 దఫాలుగా నిర్వహించబడ్డాయి. తొలి దఫా 19 ఏప్రిల్‌న 101.5 స్థానాలకు, 2వ ఫేజ్ 26 ఏప్రిల్‌న 87.5 స్థానాలకు, 3వ ఫేజ్ 07 మేన 94 స్థానాలకు, 4వ ఫేజ్ 13 మేన 96 స్థానాలకు, 5వ ఫేజ్ 20 మేన 49 స్థానాలకు, 6వ ఫేజ్ 25 మేన 58 స్థానాలకు, 7వ చివరి ఫేజ్ 01 జూన్ 2024న 57 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ సాధారణ ఎన్నికల్లో అత్యధికంగా 441 స్థానాలకు భాజపా, 285 స్థానాలకు కాంగ్రెస్, 62 స్థానాలకు సమాజ్‌వాదీ, 47 స్థానాలకు సిపిఎం, 47 స్థానాలకు తృణముల్ కాంగ్రెస్ పార్టీలు ప్రధానంగా ఎన్నికల క్షేత్రంలో తమ అదృష్టాలను, ఆదరణను పరిక్షించుకోనున్నాయి. గత దశాబ్ద కాలంగా భాజపా నేతృత్వ ఎన్‌డిఏ ప్రభుత్వం దాదాపు 300 సంక్షేమ పథకాలతో 90 కోట్ల జనాలకు రూ 34 ట్రిలియన్లు వెచ్చించడా చూసాం. ఇంత జరిగినా నిరుద్యోగం రికార్డు స్థాయిలో 23.2 శాతం వరకు పెరిగింది. ముఖ్యంగా గ్రాడ్యుయేట్‌లలో నిరుద్యోగం 42.3 శాతంగా నమోదు అయ్యింది. ఫిబ్రవరి 2024లో సుప్రీంకోర్టు ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో పార్టీలు నిధులను సమీకరించడాన్ని రద్దు చేసింది. దేశంలో భాజపా రూ 6,060 కోట్లు, తృణముల్ రూ 1,609 కోట్లు, కాంగ్రెస్ రూ 1,412 కోట్లు, బిఆర్ఎస్ రూ 1,215 కోట్లు, బిజెడీ రూ 776 కోట్లను బాండ్స్ రూపంలో పొందడం జరిగింది. 'అబ్ కీ బార్ 400 పార్' అనే నినాదంతో భాజపా మోదీ నేతృత్వంలో 'మోదీ కీ గ్యారంటీ' అంటూ ఈ ఎన్నికల్లో విస్తృత ప్రచారం చేసింది. నారీ శక్తి, లక్‌పతి దీదీ, ఉచిత రేషన్, మత్తుత్తు ధరలు పెంచడం, ఉచిత విద్యుత్తు, 3 కోట్ల గృహాల నిర్మాణం, వన్ నేషన్ వన్ ఎలక్షన్, యూనిఫాం సివిల్ కోడ్, 5 ట్రిలియన్ల ఎకానమీకి చేరడం, యూఎన్ భద్రతా మండలిలో సభ్యత్వం లాంటి పార్టీ మానిఫెస్టోతో భాజపా ఎన్నికల కదన రంగంలోకి దూకింది. భారత్ జోడో న్యాయ యాత్రతో జనవరి 2024లో రాహుల్ గాంధీ కాంగ్రెస్ ప్రచారానికి తెర లేపారు. ఏడాదికి 30 లక్షల యువతకు ఉద్యోగాల కల్పన, పేద మహిళలకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం, మద్దత్తు ధరను చట్టబద్ధమైన చేయడం, పేదలకు ఉచిత వైద్యం, కులగణన చేపట్టడం లాంటి ఎన్నికల హామీలతో 'న్యాయ పత్ర' విడుదల చేసి ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నించారు. ఒపినియన్ పోల్స్ అంచనాల ప్రకారం ఎన్నికల ఫలితాలు ఎన్‌డిఏ పక్షాలకు మెజారిటీ స్థానాలు కనిష్టంగా 306 నుంచి గరిష్టంగా 411 వరకు రావచ్చని తెలిపారు. తొలి ఫేజ్‌లో 66.14 శాతం, 2వ ఫేజ్‌లో 66.71 శాతం, 3వ ఫేజ్‌లో 65.68 శాతం, 4వ ఫేజ్‌లో 69.16 శాతం, 5వ ఫేజ్‌లో 62.20 శాతం, 6వ ఫేజ్‌లో 63.36 శాతం, 7వ ఫేజ్‌లో 61.23 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏడు దఫాలుగా జరిగిన ఈ సాధారణ ఎన్నికల్లో దాదాపు 65 శాతం వరకు, అనగా దాదాపు 63 కోట్ల భారత ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అర్థం అవుతున్నది.తాజాగా విడుదలైన పలు ఎగ్జిట్ పోల్స్ అంచనాల ప్రకారం 350 సీట్ల వరకు నెగ్గి మోదీ నేతృత్వంలో తీన్మార్ అంటూ ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడనున్నట్లు స్పష్టం అవుతున్నది. ఈ సాధారణ ఎన్నికల్లో దక్షిణాది రాష్ట్రాల్లో భాజపా తన ఆదరణను పెంచుకోవడం ఖాయంగా తోస్తున్నది. నరేంద్ర మోదీ మూడవ సారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి గ్యారంటీగా హామీలను అమలు పరచాలని, విశ్వవ్యాప్తంగా భారత ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయాలని కోరుకుందాం. ఏపీ శాసనసభ ఎన్నికల ఫలితాల్లో స్పష్టత రాలేదని, కొద్ది మెజారిటీతో ఎన్‌డిఏ లేదా వైసిపీ గెలవవచ్చని సర్వేలు అస్పష్టమైన తీర్పును ఇచ్చాయి. అతి పెద్ద ప్రజాస్వామ్య భారతానికి విజయవంతంగా ఎన్నికలను నిర్వహించిన భారత ఎన్నికల కమీషన్ (ఈసిఐ) బాధ్యులకు, ఎన్నికల సిబ్బందికి ప్రతి దేశ పౌరుడు కృతజ్ఞతలు సమర్పించాల్సిందే. ఎన్నికల్లో ఎవరు ఓడినా ఎవరు గెలిచినా ప్రజాస్వామ్య విలువలు, ఓటరు మహాశయులు గెలిచారనే ఒక్క మాట మాత్రం వాస్తవం.

# మంగళవారం మద్యం దుకాణాలు బంద్




హైదరాబాద్ **మన వార్త** : తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ వ్యాప్తంగా మంగళవారం (జూన్ 4) లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. రేపు ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు సైబరాబాద్ కమిషనరేట్ ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. మంగళవారం హైదరాబాద్‌లో మద్యం దుకాణాలు మూసివేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి ఆదేశాలు జారీ చేశారు. జూన్ 4న ఉదయం 6 గంటల నుంచి జూన్ 5వ తేదీ ఉదయం 6 గంటల వరకు నగరంలోని మద్యం దుకాణాలు, బార్‌లు, రెస్టారెంట్‌లు మూసివేయాలని ఆదేశించారు. అలాగే ఈ సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ప్రకటించారు. ఎవరైన అక్రమంగా మద్యం నిల్వ చేసి అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు భద్రతను కట్టుదిట్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడడం, సమావేశాలు, ర్యాలీలపై కూడా జూన్ 5 వరకు ఆంక్షలు అమలులో ఉంటాయి. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, సురక్షితంగా జరిగేలా చూడడానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంతర సంఘటనలు జరగకుండా నిరోధించడానికి భారీ సంఖ్యలో పోలీసులను మోహరింపజేస్తున్నారు. కాగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత నెల 13న లోక్‌సభ ఎన్నికలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరిగిన సంగతి తెలిసింది. ఈ ఎన్నికలకు సంబంధించిన ఓట్లను జూన్ 4న లెక్కించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల నియోజకవర్గాల పరిధిలో మొత్తం 19 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎన్నికల సంఘం జారీ చేసిన పాసులు ఉన్న సిబ్బంది, ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థుల ఏజెంట్లు, మీడియా ప్రతినిధులకుమమాత్రమే అనుమతి ఉంటుంది.

# చంద్రుని అవతలి వైపుకు చేరుకున్న చాంగే-6 వ్యోమనౌక



**మన వార్త** చంద్రునికి అవతలి వైపు ఖనిజాలను అన్వేషించేందుకు మానవరహిత వ్యోమనౌకను పంపించగా అది ఆదివారం సురక్షితంగా ల్యాండ్ అయిందని చైనా అంతరిక్ష సంస్థ తెలిపింది. చాంగే-6 ల్యూనార్ లాండర్ చైనా అధికారిక సమయం ప్రకారం, ఆదివారం ఉదయం 6:23 గంటలకు చంద్రుడి వెనుక భాగంలో ఉన్న ఐట్‌కెన్ బేసిన్‌లో విజయవంతంగా దిగినట్లు చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ తన వెబ్‌సైట్‌లో ఒక ప్రకటనలో తెలిపింది. మే 3న దీనిని ప్రయోగించగా దాదాపు 53 రోజుల పాటు ప్రయాణించి చంద్రున్ని చేరుకుంది. దీంతో అంతరిక్ష ప్రయోగాల్లో చైనా కీలక అడుగు వేసినట్లు అయింది. ల్యాండర్, అసెండర్‌తో కూడిన ఈ వ్యోమనౌక ఆ ప్రాంతంలో ఉండే రాళ్ళు, మట్టి నమూనాలను సేకరిస్తుంది. ఉపరితలంపై డ్రిల్ చేసి దాని రెండు కిలోల మట్టిని భూమి పైకి తీసుకు వస్తుంది. అలాగే, అక్కడికక్కడే మట్టి నమూనాలను శాస్త్రీయ విశ్లేషణ చేసి డేటాను తిరిగి పంపిస్తుంది. ఈ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి కానుంది. గతంలో 2019లో కూడా చైనా చాంగే-4 అనే వ్యోమనౌకను చంద్రుని అవతలి వైపుకు పంపించింది. చైనా 2030 నాటికి చంద్రుడిపైకి మనుషులతో కూడిన మిషన్‌ను పంపాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే,చంద్రుని ఉపరితలంపై స్థావరాన్ని నిర్మించాలని యోచిస్తోంది. దీనిలో భాగంగా చైనా ఈ ప్రయోగాలు చేస్తుంది. చంద్రుడిపై ఈ ప్రాంతం గురించి ఇప్పటి వరకు ఎవరూ పరిశోధించలేదని, ఇక్కడికి వెళ్లేందుకు ఎవరూ ప్రయత్నించలేదని, దీనిని సాధించామని చైనా పేర్కొంది.

# సందేశ్ ఖాళీలో మరోసారి ఉద్రిక్తత..



**మన వార్త** పశ్చిమ బెంగాల్ లోని సందేశ్ ఖాళీలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల తర్వాత హింస చెలరేగింది. ఈ హింసపై బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించాలని సీఎం మమతా బెనర్జీని కోరారు. ఈ విషయంపై మమతా బెనర్జీకి లేఖ రాశారు. శనివారం పోలింగ్ ముగిసిన కొన్నిగంటలకే మహిళలపై దాడులు జరిగినట్లు తెల్సిందని గవర్నర్ లేఖలో పేర్కొన్నారు.. ఇలాంటి దాడులు కొనసాగితే సహించేది లేదన్నారు. బాధిత మహిళల కోసం రాజ్ భవన్ తలుపులు తెరిచే ఉంటాయని పేర్కొన్నారు. రాజ్ భవన్ లో సురక్షితంగా ఆశ్రయం పొందవచ్చని అన్నారు. ఎన్నికలు ముగిసిన కొన్నిగంటలకే సందేశ్ ఖాళీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలింగ్ ముగిసిన తర్వాత అగర్హతి గ్రామంలో పోలీసులపై కొందరు దుండగులు దాడులు జరిపారు. అయితే, ఈకేసుకు సంబంధించి పలువురిని అదుపులోకి తీసుకునేందుకు అధికారులు అక్కడికి వెళ్లారు. అక్కడికి వెళ్లిన పోలీసులను స్థానిక మహిళలు అడ్డుకున్నారు. పోలీసులకు, మహిళలకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు గ్రామంలోకి వెళ్లకుండా చెట్ల కొమ్మలను పడగొట్టి.. రహదారిని దిగ్బంధించారు.

# అస్సాంలో ఆగని వరదలు



గౌహతి **మన వార్త** : అస్సాంలో వరదలు కొనసాగుతున్నాయి. వరదల కారణంగా మే 28 నుంచి ఆదివారం నాటికి 15 మంది మరణించినట్లు అధికారులు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, బాధిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని తెలిపారు. వరదల కారణంగా హైలాకండి హొజారు, మోరిగావ్, కరీంగంజ్, నాగావ్, కాచర్, దిబ్రూఘర్, గోలాఘట్, కర్బీ అంగ్లాంగ్ వెస్ట్, డిమా హసావో జిల్లాల్లోని మొత్తంగా 6,01,642 మంది ప్రభావితమయ్యారని అధికారులు చెప్పారు. నాగావ్ జిల్లా అత్యధికంగా ప్రభావానికి గురైనట్లు చెప్పారు. కొపిలి, బరాక్, కుషియార నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. సహాయ శిబిరాల్లో 50 వేల మంది నిరాశ్రయులు తలదాచుకుంటున్నారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, స్థానిక బృందాలు సహాయక, పునరావాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో రోడ్డు, రైలు సేవలు నిలిచిపోయాయి. సోమవారం వరకూ కనీసం 10 రైళ్లను రద్దు చేశారు.

# ప్రజ్వల్ ఫోన్ డేటా కోసం

## యాపిల్ సర్వర్ల యాక్సెస్ కోరుతున్న అధికారులు

**మన వార్త** కర్ణాటక సెక్స్ టేపుల వ్యవహారంలో ప్రజ్వల్ రేవణ్ణ ఐఫోన్ కీలకంగా మారింది. ఈ ఫోన్ ద్వారానే ప్రజ్వల్ మహిళలతో శృంగార వీడియోలను చిత్రీకరించాడని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఫోన్ గురించి ప్రజ్వల్ ను ప్రశ్నించగా.. ఏడాది క్రితం తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నానని తెలిపారు. ఫోన్ పోయినట్లు హొలెనరసిపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సిట్ అధికారులకు తెలిపారు. దీంతో, ఈ ఫోన్‌లోని లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోల కోసం ఆపిల్ సర్వర్ లను యాక్సెస్ చేయాలని సిట్ భావిస్తుంది. సాధారణంగా, యాపిల్ ఐక్లౌజ్ లో మెసేజ్ లు, వాయిస్ రికార్డింగ్ లు, ఫొటోలు, వీడియోలు సహా మొత్తం సమాచారాన్ని నిల్వ చేస్తుంది. దీంతో ప్రజ్వల్ రేవణ్ణ ఫోన్ లోని డేటా కావాలంటే ఐక్లౌడ్ ని నేరుగా యాక్సెస్ చేయడమే సిట్ అధికారుల ముందున్న ఏకైక మార్గం. దీంతో, సిట్ అధికారులకు యాపిల్ సర్వర్లు యాక్సెస్ చేసే అవకాశం వస్తే.. కేసు దర్యాప్తు మరింత వేగవంతం అయ్యే ఛాన్స్ ఉంది. ప్రస్తుతం ఈ కేసులో లైంగిక వేధింపులకు గురైన బాధితురాలి వాంగ్మూలమే సిట్ వద్ద ఉన్న బలమైన సాక్ష్యం. ఏప్రిల్ నెలలో ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ టేపుల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. దీంతో పాటు రేవణ్ణ ఇంట్లో పనిచేస్తున్న 47 ఏళ్ల మహిళ ప్రజ్వల్‌తో పాటు ఆయన తండ్రి హెచ్‌డీ రేవణ్ణపై అత్యాచారం, లైంగిక వేధింపులు కేసు పెట్టింది. ఆ తర్వాత పరిణామాల్లో ప్రజ్వల్ దేశాన్ని వదిలి జర్మనీ వెళ్లిపోయాడు. మే 31 విచారణకు హాజరవుతానని ప్రజ్వల్ వీడియో సందేశాన్ని పెట్టారు. దీంతో మహిళా పోలీసుల బృందం బెంగళూరు ఎయిర్ పోర్టులో ఆయన్ని అరెస్టు చేసింది. వెంటనే ప్రజ్వల్‌ను బెంగళూరు కోర్టులో ప్రవేశపెట్టగా.. జూన్ 6 వరకు కస్టడీకి పంపింది



## జమ్మికుంట ప్రముఖులు తిరుపతయ్య హఠాత్ మరణం..



**జమ్మికుంట, జూన్ 03( మన వార్త ప్రతినిధి):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో భాగంగా మృదు స్వభావం కలిగిన బిజేపి సీనియర్ నాయకులు ,జమ్మికుంట ఆర్యవైశ్య మండల మహాసభ అధ్యక్షులు జమ్మికుంట పట్టణానికి చెందిన గుండా తిరుపతయ్య సోమవారం గుండెపోటుతో కన్నుమూశారు. మృదు స్వభావం గల తిరుపతయ్య చిన్నా, పెద్దా, బీద, ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరితో ఆప్యయతగా పలకరించే వ్యక్తి ఒక్కసారిగా దురమవ్వడంతో బందువులు, మిత్రులు, సుపరిచితులు,వ్యాపారస్తులు,నాయకులు విలపించారు. అదేవిధంగా కుల, మతాలతో సంబంధం లేకుండా ఎవరికైనా ఆపదని తెలిస్తే ధైర్యం చెప్పే వ్యక్తిని కోల్పోయామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు చేసిన సేవలు ప్రతి ఒక్కరు గుర్తు చేసుకుంటున్నారు. ఆయన భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం




**కమలాపూర్ జూన్ 3(మన వార్త ప్రతినిధి కళ్యాణ్ )** హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపిడివో గుండె.బాబు అధ్యక్షతన సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది.మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె.బాబు మాట్లాడుతూ తప్పనిసరిగా సామాజిక తనిఖీ బృందానికి కావలసిన రికార్డులన్నీ కూడా సకాలంలో అందజేసి కమలాపూర్ మండలంలో జరిగే 15వ విడత సామాజిక తనిఖీ ఒక ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని సామాజిక తనిఖీ బృందాన్ని, పంచాయతీ కార్యదర్శులను మరియు ఉపాధి హామీ సిబ్బందిని కోరడం జరిగింది. ఈ సమావేశములో ఎస్ఆర్పిచెన్నకేశవులు మాట్లాడుతూ కమలాపూర్ మండలంలో తేదీ:01/04/2023 నుండి తేదీ: 31 /3 /2024 వరకు 335 పనులకు గాను ఉపాధి హామీ పథకంలో 4.8 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని , ఇట్టి మొత్తానికి రేపటినుండి మండలంలో వివిధ గ్రామపంచాయతీలలో డిఆర్పిల సహాయముతో టీములుగా ఏర్పడి సామాజిక తనిఖీ బృందము నిర్వహించడం జరుగుతుందని, కావున సామాజిక తనిఖీ బృందానికి ప్రత్యేక అధికారులు, పంచాయతి కార్యదర్శులు మరియు ఉపాధి హామీ సిబ్బంది సహకరించాలని కోరడం జరిగింది.

## పాలడైరిలో వ్యక్తి మృతి ..



**జమ్మికుంట, జూన్ 03( మన వార్త ప్రతినిధి):** పాల డైరీలో ట్యాంక్ చెక్ చేస్తుండగా ప్రమాద వశాత్తూ ట్యాంకర్ లో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన వేంకటేశ్వరపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.పొలుసులు బందువుల వివరాల ప్రకారం జమ్మికుంట మండలం వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలోని ఎస్ ఆర్ కే పాలడైరిలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం,కృష్ణా జిల్లా, నదిగామ చందమామ పేటకు చెందిన ముజిబ్ (44) అనే వ్యక్తి రోజు వారిలాగానే డైరిలోని ఈ టీ పి ట్యాంకర్ లోని నీటిని చేక్ చేస్తుండగా ప్రమాద వశాత్తూ కాలుజారి ట్యాంకర్ లో పడగా తిరుపతి అనే వ్యక్తి గమనించి డైరీ నిర్వాహకులకు చెప్పగా మధు ప్రవీణ్ ల సహకారంతో ఈ టి పి ట్యాంక్ నుండి బయటకు బయటికి తీసి హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్దరించారని మృతుని బంధువులు,డైరీ నిర్వాహకులు తెలిపారు.మృతునికి భార్య కరీమా మున్నిసా, ఇద్దరు కూతుర్లు వున్నారు.పోలిసులు ఆసుపత్రికి చేరుకుని మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రవి తెలిపారు.

## కోతి, కుక్కల ఆటలు.. ఆశ్చర్యపోయిన జనాలు



**చందుర్తి మండలం జూన్ 03( మన వార్త ప్రతినిధి ముఖేష్)** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం, మల్యాల గ్రామ శివారులోని వేములవాడకు వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన గల వెంకటేశ్వర దేవాలయం సమీపంలో గల వేప చెట్టు క్రింద సోమవారం సుమారు ఉదయం 11. 30 సమయంలో కుక్కతో కోతులు, కోతులతో కుక్క ఆటలు ఆడ సాగాయి. ఆ సమయంలో ఆ దారిగుండా వెళ్లే వారు వాటిని చూసి ఆశ్చర్యపోయారు. కొందరు వాటి కనువిందైన ఆటను చూసి వారి చరవాణిలలో బందించుకున్నారు.

## చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నా వేములవాడ డీఎస్పీ



**చందుర్తి మండలం జూన్ 03 ( మన వార్తా ప్రతినిధి ముఖేష్ )** వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తాను చిన్నతనంలో చేసిన కులవృత్తిని చేస్తూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్యాల గ్రామానికి విధుల నిమిత్తం వెళ్లిన డీఎస్పీ.. అక్కడ కొద్దిసేపు కమ్మరిగా మారిపోయారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్గా మారింది.

## కరీంనగర్ కమీషనరేట్ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు:



–అభిషేక్ మహంతి

తెలంగాణ రాష్ట్రంలో లోకసభ ఎన్నికల లెక్కింపు జూన్ 04వ తేదీ మంగళవారం నాడు జరగనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఎన్నికల లెక్కింపు ప్రక్రియకు విఘాతం కలగకుండా, సజావుగా సాగేలా తీసుకునేటువంటి ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా 144 సెక్షన్ ఆఫ్ సి.ఆర్.పి.సి. అమలు చేస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి, ఐపీఎస్. ఆదివారంనాడు ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులు తేదీ:04-06-2024 మంగళ వారం రోజు ఉదయం 06 గంటల నుండి తేదీ:05-06-2024 బుధవారంనాడు ఉదయం 06గంటల వరకు, ఒకవేళ రీ-కౌంటిగ్ జరిగితే అవికూడా ముగిసేవరకు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఐదుగురికి మించి గుమికూడరాదని తెలిపారు. ఏదైనా చట్టపరిధిలోని కారణంచేత సమావేశ పడవలసిన అవసరం ఏర్పడితే సంబంధిత అధికారి ముందస్తు అనుమతి తప్పనిసరి అని తెలిపారు. పై ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్. అభిషేక్ మహంతి విలేకరుల సమావేశంలో తెలిపారు.

## ఉచిత మెగా ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన..



**వేములవాడ, జూన్ 03 (మన వార్త ప్రతినిధి నందు రావు):** ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ కమ్యూనిటి పోలీసింగ్ లో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ కావడానికి , జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతల్లో ఉండే ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో %×హీూ% సిరిసిల్ల, అశ్విని హాస్పిటల్ వారి సహకారంతో వీర్నపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ముఖ్య అతిధిగా హాజారై ప్రారంభించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతాల్లో ఉండే ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారికి సత్వరమే వైద్యం సేవలు అందించడమే లక్ష్యంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసి నిపుణులు అయిన డాక్టర్ల బృందం ఆధ్వర్యంలో కంటి, దంత, గైనకాలజిస్ట్, న్యూరో, జనరల్ ఫిజీషియన్ , జనరల్ సర్జన్ ,అర్థోపెడిక్, పిల్లల వైద్య నిపుణులు, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు ముందుగా వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం చికిత్సలు అందించడాం జరిగిందని,ఆరోగ్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు.వైద్య శిబిరానికి హాజరైన చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరికీ భోజన, రవాణా వసతులు కల్పించడం జరిగిందన్నారు.ప్రజలకు పోలీస్ సేవలు మరింత దగ్గర అవ్వడానికి పోలీస్ ఉన్నది ప్రజా భద్రత కోసమే అనే నమ్మకం కలగడం కోరకు కమ్యూనిటీ పోలిసింగ్ లో భాగంగా వివిధ కార్యక్రమాలు చేయడం జరుగుతుందని అందులో భాగంగా గతంలో వీర్నపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల యువతకు స్పోర్ట్స్ కిట్స్ అందజేయడం జరిగిందన్నారు.గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఎన్నో సౌకర్యాలు మెరుగు పడ్డాయని తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలను చక్కగా చదివించుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టిన సౌకర్యాలను సద్వినియొగం చేసుకోవాలన్నారు.యువత చెడు మార్గాల వైపు మరలకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రుల మీద ఉందని , గంజాయి అలవాటు పడిన వారి వివరాలు అందించాలని వారికి నిపుణులు అయిన వైద్య నిపుణుల చేత కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు.పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి సహకరించి బారి ఎత్తున పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేపించుకున్న ప్రజలను అభినందించిన జిల్లా ఎస్పీ. ఉచిత మెగా వైద్య శిబిరానికి పిలువగానే సిరిసిల్ల , ఎల్లారెడ్డిపేట్ నుండి వచ్చిన వైద్య బృందానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్.ఐ రమేష్ ,డాక్టర్లు సత్యనారాయణ, అభినయ్, సునీల్ కుమార్ ఆర్థోపెడిక్, రవి కిరణ్ జరల్ సర్జన్, అవని గైనకలజిస్ట్, అమిత జనరల్ ఫిజిసియన్ , ఓబులేసు పిల్లల వైద్య నిపుణులు, గోపి కృష్ణ దంత వైద్య నిపుణులు, అజిత్ కుమార్ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు, కార్తిక్ కంటి వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గోరంటాల గ్రామంలో కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి



**–మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి**

**–రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు**

**గంభీరావుపేట,జూన్ 03 (మన వార్త ప్రతినిధి)** గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామంలో ఆదివారం ఉదయం గోరంటాల గ్రామానికి చెందిన గొల్లపల్లి ఎల్లయ్య హొటల్లో చాయ్ తాగి తిరిగి సైకిల్ పై రోడ్డు దాటుతూ ఇంటికి వెళ్తుండగా కామారెడ్డి నుండి సిరిసిల్ల వెళుతున్న కారు వచ్చి సైకిల్ పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందగా సోమవారం ఉదయం 10 గంటలకు మృతుని కుటుంబ సభ్యులతో పాటు బంధువులు మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి రెండు గంటల పాటు ధర్నా రాస్తారోకో నిర్వహించారు విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐ బి రామ్మోహన్, పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడి నచ్చ చెప్పారు బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా కౌంటింగ్ కు అంతా రెడీ..




**వేములవాడ, జూన్ 03 (మన వార్త ప్రతినిధి నందు రావు):** సీపీ అభిషేక్ మోహంతి ఆధ్వర్యంలో పటిష్టం భద్రత కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్,అబ్జర్వర్లు 4వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపునకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సారథ్యంలో యంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టారు. మే నెల 13వ తేదీన పార్లమెంటు ఎన్నికల పోలింగ్ జరిగింది. మొత్తం 28 మంది అభ్యర్థులు పోటీ చేశారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 17,97,150 మంది ఓటర్లు ఉండగా, 13,03,690 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 72.54 నమోదయింది. వయోవృద్ధులు దివ్యాంగులు 1625 మంది ఉండగా, హెూమ్ ఓటింగ్ ద్వారా 1560 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సిబ్బంది 10, 200 మంది ఉండగా 8,811 మంది, సర్వీస్ ఓటర్స్ 1018 మంది ఉండగా, 476 మంది ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను కరీంనగర్ లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజీలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఈ మేరకు ఎస్ఆర్ఆర్ కాలేజీలో ఓట్ల లెక్కింపునకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సారథ్యంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు.కౌంటింగ్ సూపర్వైజర్స్ 124 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 124, మైక్రోఅబ్జర్వర్లు 124 మందిని కేటాయించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్వైజర్స్ 21, కౌంటింగ్ అసిస్టెంట్లు 35, మైక్రో అబ్జర్వర్లు 14 మందిని అలాట్ చేశారు. మంగళవారం ఉదయం 6 గంటలకు వీరిని టేబుల్స్ వారీగా కేటాయించనున్నారు. వీరందరికీ ఇప్పటికే ఓట్ల లెక్కింపుపై శిక్షణ ఇచ్చారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. ఎనిమిదిన్నర గంటల నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది.

# మనసులో మాట చెప్పిన మమ్ముట్టి



**మన వార్త** ఇంత వరకు సాధించింది ఏంటి? రేపటి నుంచి ఏం సాధించాలి? ఇలాంటి లెక్కలన్నీ తనకు తెలియవని అంటున్నారు మలయాళం మెగాస్టార్ మమ్ముట్టి. తనకు తెలిసిందంతా ఇవాళ ఉన్న పనిని పూర్తి చేయడమే అని చెబుతున్నారు.ఇటీవల మమ్ముట్టి చెప్పిన కొన్ని మాటలు వైరల్ అవుతున్నాయి. ఇండస్ట్రీకి కొత్తగా వస్తున్న వారు తప్పక వినాలనే సలహాలూ వినిపిస్తున్నాయి. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టికి ఫోర్ హండ్రెడ్ ప్లస్ ల ఎక్స్ పీరియన్స్ ఉంది.ఇంత వరకు సాధించింది ఏంటి? రేపటి నుంచి ఏం సాధించాలి? ఇలాంటి లెక్కలన్నీ తనకు తెలియవని అంటున్నారు మలయాళం మెగాస్టార్ మమ్ముట్టి. తనకు తెలిసిందంతా ఇవాళ ఉన్న పనిని పూర్తి చేయడమే అని చెబుతున్నారు. ఇటీవల మమ్ముట్టి చెప్పిన కొన్ని మాటలు వైరల్ అవుతున్నాయి. ఇండస్ట్రీకి కొత్తగా వస్తున్న వారు తప్పక వినాలనే సలహాలూ వినిపిస్తున్నాయి. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టికి ఫోర్ హండ్రెడ్ ప్లస్ ల ఎక్స్ పీరియన్స్ ఉంది. ఆయన కెరీర్‌లో చేయని పాత్రలేదని అంటారు. కానీ నేను చేయాల్సింది ఇంకా చాలా ఉంది... ఎన్నెన్నో పాత్రలు నన్ను ఊరిస్తూనే ఉంటాయని వినమ్రంగా చెబుతుంటారు మమ్ముక్కా. రీసెంట్‌గా ఆయన నటించిన కాన్సెప్టులు చూసి విస్తుపోతోంది మలయాళ ఇండస్ట్రీ. తనకు తెలిసింది యాక్టింగ్ మాత్రమే అని అంటారు మమ్ముట్టి. గడిచిన క్షణాల గురించి ఆలోచించే అలవాటు ఆయనకు అసలు లేదట. గతం గతః అనే పదాన్ని నూటికి నూరుపాళ్లు నమ్ముతారట. ఈ క్షణం ఏంటి? అనేది మాత్రమే ఆయన స్పృహలో ఉంటుందట. అంతకు మించి ఆలోచించడం కూడా వృథా అని అంటారు ఈ స్టార్. స్టార్‌డమ్ చూసుకుని గొప్పలు పోవడం తనకు ఇష్టం లేదని అంటున్నారు మమ్ముట్టి.

## గుడ్ న్యూస్ చెప్పబోతున్న వైష్ణవి చైతన్య..!



**మన వార్త** బేబీ మూవీ తో హీరోయిన్ గా ఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చిన వైష్ణవి చైతన్య.. మొట్టమొదటి చిత్రంతోనే భారీ సక్సెస్ ని అందుకుంది. విమర్శకుల నుంచి ప్రశంసలను దక్కించుకుని టాలీవుడ్ లో తనదైన ముద్ర వేసింది.దీంతో ఈ బ్యూటీ కి ఆఫర్లు క్యూ కట్టాయి. ఈ క్రమంలోనే తాజాగా లవ్ మీ అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకి వచ్చింది వైష్ణవి. దిల్ రాజు మేనల్లుడు ఆశిష్ హీరోగా నటించిన ఈ సినిమా రిలీజ్ కు ముందు ప్రమోషన్స్ ఓ రేంజ్ లో చేశారు. కానీ బాక్స్ ఆఫీస్ వద్ద అనుకొన్నంత ఫలితం దక్కించుకోలేకపోయింది. దీంతో మూడు వారాలకే ఓటీటీలో కి వచ్చేందుకు సిద్ధమయింది. ఇక ఇదిలా ఉంటే రీసెంట్గా లవ్ మీ మూవీ టీం తో సుమా అడ్డ షోకు వెళ్ళింది వైష్ణవి చైతన్య. తాజాగా ఈ షోకు సంబంధించిన ప్రోమో రిలీజ్ చేశారు టీం. షోలోకి ఎంట్రీ ఇవ్వడంతోనే వైష్ణవి, ఆశిష్, రవి కృష్ణ సందడి చేశారు. ఇక అనంతరం హీరో ఆశిష్.. వైష్ణవి చైతన్య గురించి షాకింగ్ కామెంట్స్ చేశాడు. " వైష్ణవి త్వరలోనే ఓ గుడ్ న్యూస్ చెప్పబోతోంది " అంటూ నోరు జారడు. అయితే.. ఈ గుడ్ న్యూస్ ఏంటో చెప్పక ముందే అడ్డుపడిన సుమ.. రీసెంట్ గా పెళ్లి అయింది నీకు.. గుడ్ న్యూస్ చెప్పాల్సింది నువ్వు కదా అని కౌంటర్ వేసింది. ఇంతకీ ఆ గుడ్ న్యూస్ ఏంటి అనే సందేహాలు ప్రతి ఒక్కరిలోనూ నెలకొంది. ప్రజెంట్ ఎందుకు సంబంధించిన ప్రోమో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. మరి ఆ గుడ్ న్యూస్ ఏంటో తెలియాలంటే వైష్ణవి చైతన్య నోరు విప్పాల్సిందే. రౌడీ బాయ్స్ మూవీ తో టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన ఆశిష్ పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు.

# విండీస్ బోణి




**మన వార్త** టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ బోణి చేసింది. గ్రూప్ సిలో భాగంగా పాపువా న్యూగినియాతో జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాపువా న్యూగినియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని విండీస్ 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ బ్రెండన్ కింగ్ (34. 29 బంతుల్లో 7 ఫోర్లు), నికోలస్ పూరన్ (27), రాణించారు. జాన్సన్ చార్లెస్ (0) డకౌటవ్వగా.. రొమన్ పావెల్ (15) పరుగులు చేశాడు. చివర్లో కాస్త ఉత్కంఠ ఏర్పడినా రోస్టన్ ఛేజ్ (42, 27 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడి ఒక ఓవర్ మిగిలుండగానే విండీస్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఆండ్రీ రస్సెల్ (15బీ 9 బంతుల్లో 1 సిక్స్) నాటౌట్‌గా నిలిచాడు. న్యూగినియా బౌలర్లలో అసద్ వాలా 2, జాన్ కారికో, చాడ్ సోపర్, అలీ నావో ఒక్కో వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌లో ముందుగా టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన పాపువా న్యూగినియా బ్యాటర్లలో సెసే బావు (50, 43 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకం బాదాడు. కెప్టెన్ అసద్ వాలా (21), కిప్లిన్ డోరిగా (27) పరుగులు చేశారు. టోనీ ఉరా (2), లెగా సియాకా (1), హిరీ హిరీ (2) సింగిల్ డిజిట్ స్కోరుకే పెవిలియన్ చేరారు. వెస్టిండీస్ బౌలర్లలో రస్సెల్ 2, అల్జారీ జోసెఫ్ 2, అకీలా హొసేన్, రొమారియో షెఫర్డ్, గుడాకేష్ మోటీ తలో వికెట్ పడగొట్టారు.

## ఒకేరోజు రెండు సెమీ ఫైనల్స్..

**మన వార్త** నేటి నుంచి ఐసీసీ పొట్టి ఫార్మాట్ 9వ ప్రపంచ కప్ ప్రారంభమైంది. దీనిలో 20 జట్లు మొదటిసారి ఆడుతున్నాయి. టోర్నమెంట్‌లో మొదటిసారిగా, జూన్ 27న రెండు సెమీ-ఫైనల్‌లు ఒకే రోజు జరుగుతాయి.ఒకదానికి రిజర్వ్ డే, మరొక మ్యాచ్‌కు రిజర్వ్ డే లేకపోవడం విశేషం. భారత కాలమానం ప్రకారం జూన్ 27న రెండు సెమీఫైనల్‌లు ఒకే రోజు జరుగుతాయి. కానీ, అమెరికన్, కరేబియన్ టైమింగ్ ప్రకారం, మొదటి సెమీ-ఫైనల్ జూన్ 26 రాత్రి 8 గంటలకు, రెండవ సెమీ-ఫైనల్ జూన్ 27 ఉదయం 10:30 గంటలకు జరుగుతుంది. కాగా, రెండో సెమీ ఫైనల్ జూన్ 27న అమెరికా కాలమానం ప్రకారం ఉదయం 10:30 గంటలకు గయానాలో ప్రారంభమవుతుంది. అదే రోజు వర్షం పడితే 250 నిమిషాల అదనపు సమయం అంటే 4 గంటల 10 నిమిషాలు ఉంచారు. దీనికి రిజర్వ్ డే ఉండదు. ఎందుకంటే రిజర్వ్ డే ఉంచినట్లయితే, మ్యాచ్ జూన్ 28 వరకు ఉంటుంది. ఈ సందర్భంలో సెమీ-ఫైనల్‌లో గెలిచిన జట్టుకు ఫైనల్‌కు చాలా తక్కువ సమయం లభిస్తుంది. ఆ మరుసటి రోజు జూన్ 29న ఫైనల్ జరగనుంది. ఈ క్రమంలో గతంలోనూ ఇలాంటి వివాదం చోటు చేసుకుంది. 10 సెప్టెంబర్ 2023, ఆసియా కప్ సూపర్-4 మ్యాచ్‌లో భాగంగా భారత్-పాకిస్తాన్ ముఖాముఖిగా తలపడ్డాయి. భారత్ బ్యాటింగ్‌కు దిగింది. రోహిత్ శర్మ, శుభ్‌మాన్ బాగా ఆడారు.25వ ఓవర్లో వర్షం కురవడంతో మ్యాచ్ నిలిచిపోయింది. అయితే, ఈ మ్యాచ్‌కు ప్రత్యేక రిజర్వ్ డే ఉంది.

# రీ ఎంట్రీ ఇస్తున్న మీరా జాస్మిన్..



**మన వార్త** ఒకప్పుడు తెలుగు ప్రేక్షకులకు అభిమాన హీరోయిన్ మీరా జాస్మి. తెలుగులో అమ్మాయి బాగుంది, భద్ర, రారాజు, గుడుంబా శంకర్, గోరింటాకు వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది.పెళ్లి తర్వాత లకు దూరమైన మీరా జాస్మిన్ ఇప్పుడు రీఎంట్రీ ఇస్తుంది. 2014లో పెళ్లి చేసుకుని లకు దూరమైంది. కానీ ఇప్పుడు భర్తతో విడిపోయింది. ఒకప్పుడు తెలుగు ప్రేక్షకులకు అభిమాన హీరోయిన్ మీరా జాస్మి. తెలుగులో అమ్మాయి బాగుంది, భద్ర, రారాజు, గుడుంబా శంకర్, గోరింటాకు వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. పెళ్లి తర్వాత లకు దూరమైన మీరా జాస్మిన్ ఇప్పుడు రీఎంట్రీ ఇస్తుంది.2014లో పెళ్లి చేసుకుని లకు దూరమైంది. కానీ ఇప్పుడు భర్తతో విడిపోయింది. ఇప్పుడిప్పుడు మలయాళం ల్లో నటిస్తుంది. ఇటీవల మమ్ముట్టి సరసన ఓ ప్రాజెక్ట చేసిన మీరా జాస్మిన్ ఇప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలోకి తిరిగి వస్తుంది. హీరో శ్రీవిష్ణు కొత్త ప్రాజెక్టుతో తెలుగు తెరపై మరోసారి సందడి చేయనుంది. ఇటీవల సామజవరగమన, ఏం భీమ్ బుష్ లతో బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ అందుకున్న శ్రీవిష్ణు త్వరలోనే స్వాగ్ అనే లో నటిస్తున్నాడు.డైరెక్టర్ హసిత్ గోలి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తుంది. ఇందులో మీరా జాస్మిన్ కీలకపాత్ర పోషిస్తుంది. తాజాగా ఈరోజు మీరా జాస్మిన్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. అందులో మహారాణిలా తయారై కనిపిస్తుంది మీరా జాస్మిన్. ప్రస్తుతం ఈ పోస్టర్ వైరలవుతుండగా.. చాలా కాలం తర్వాత మరోసారి మీరాను తెలుగు ల్లో చూసి సంతోషిస్తున్నారు ఫ్యాన్స్. ఈ తర్వాత తెలుగులో చిత్రాల్లో నటించనున్నట్లు తెలుస్తోంది.

## పుష్ప 2 పై అజయ్ ఘోష్ కామెంట్స్



**మన వార్త** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ డైరెక్షన్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రాబోతున్న చిత్రం పుష్ప 2. ఈ మూవీ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకున్నాయి.ఈ మూవీ యొక్క మొదటి భాగానికి గాను అల్లు అర్జున్కి నేషనల్ అవార్డు దక్కిన సంగతి తెలిసిందే. తన నటనతో మెప్పించిన అల్లు అర్జున్ నేషనల్ అవార్డు దక్కించుకుని పాన్ ఇండియా హీరో అయిపోయాడు. దీంతో పుష్ప సీక్వెల్ పై మంచి హైప్స్ ఏర్పడ్డాయి. ఈ మూవీలో రష్మిక హీరోయిన్గా నటించింది. ఇక పుష్ప సినిమాలో నటుడు అజయ్ ఘోష్కి మంచి గుర్తింపు దక్కిందని చెప్పుకోవచ్చు. కాకపోతే పుష్ప ఫస్ట్ పార్ట్ లోనే అజయ్ గోష్ పాత్రకి ఎండింగ్ కార్డ్ పడింది. ఈ నేపథ్యంలో పుష్ప సీక్వెల్లో అజయ్ ఘోష్ పాత్ర ఉండదు. ఇక తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అజయ్ ఘోష్ ఇదే విషయం చెప్పుకొచ్చారు. ఈయన మాట్లాడుతూ.." పుష్ప 2 లో నా పాత్ర లేదు. నేను నటించలేక పోయాను అనే బాధ లేదు. నా కెరీర్ కతం అయ్యింది అనుకుంటున్నా సమయంలో పుష్ప లో కొండ రెడ్డి పాత్ర నాకు నిజంగా పునర్జీవనాన్ని ఇచ్చింది. నాకు ఆ సంతృప్తి చాలు " అంటూ తెలిపారు. ఇక ఏది ఏమైనా పుష్ప సీక్వెల్ కోసం ఫాన్స్ రెట్టింపు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.

## భారీ సెట్‌లో స్వయంభూ



భారీ సెట్‌లో స్వయంభూహీరో నిఖిల్ మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'స్వయంభూ'లో దేశం గర్వించేలా చేసిన టెక్నిషియన్ వర్క్ చేస్తున్నారు. బాహుబలి, ఆర్ఆర్ఆర్ వంటి ఎపిక్ మూవీస్‌కి పని చేసిన సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ 'స్వయంభూ'లో తన మ్యాజిక్ చూపించనున్నారు. మేకర్స్ విడుదల చేసిన వీడియోలో ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్‌లో ఈ టాప్ టెక్నిషియన్ ఇప్పటికే టీంలో చేరారు. మ్యాసీవ్ సెట్స్‌తో గ్రాండ్‌గా ఈ చిత్రం రూపొందుతోందని మేకింగ్ వీడియో చూస్తే తెలుస్తోంది. నిఖిల్‌కి ఇప్పటి వరకు మోస్ట్ ఎక్స్‌పెన్సీవ్ సినిమా ఇదే అని చిత్ర బృందం తెలిపింది. కెకె సెంథిల్ డీవోపీగా చేయడంతో సినిమాలోని విజువల్స్ టాప్‌నాచ్‌గా ఉండబోతున్నాయి. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన మ్యాసీవ్ సెట్‌లో జరుగుతోంది. నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా నిఖిల్ స్పెషల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ నిఖిల్ 20వ మైల్ స్టోన్ మూవీ. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సంయుక్త, నభా నటేష్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. కేజీఎఫ్, సాలార్ ఫేమ్ రవి బస్రూర్ మ్యూజిక్ అందించగా, ప్రభాహరన్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు.

## రోహిత్‌తో ఓపెనింగ్ చేసేదెవరు..?



**మన వార్త** టీ20 ప్రపంచకప్ సంగ్రామం ప్రారంభమైంది. వార్మప్ మ్యాచ్‌లో బంగ్లాపై టీమ్ఇండియా అదరగొట్టింది. చక్కటి ప్రాక్టీస్‌తో పాటు.. జట్టు కూర్పుపై స్పష్టత వచ్చేందుకు ఈ మ్యాచ్ ఉపయోగపడిందని కెప్టెన్ రోహిత్ కూడా వెల్లడించాడు.అయితే, ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మతో ఓపెనింగ్ జోడీగా జైస్వాల్ కాకుండా.. సంజూ శాంసన్ బరిలోకి దిగాడు. దీంతో ఓపెనింగ్ పార్ట్‌నర్‌గా జైస్వాల్ మొదటి ఎంపిక కాదని మేనేజ్‌మెంట్ భావిస్తోందని పలువురు విశ్లేషిస్తున్నారు. ఇదే విషయంపై మాజీ దిగ్గజం సునీల్ గావస్కర్ స్పందించాడు.రోహిత్‌తో కలిసి కోహ్లీ ఓపెనింగ్ చేయాలని గావస్కర్ అభిప్రాయపడ్డాడు. జైస్వాల్ అంత మంచి ఫామ్‌లో లేనందున ఇదే సరైన నిర్ణయమని పేర్కొన్నాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో విరాట్ అద్భుత ప్రదర్శన చేసి.. టోర్నీలో టాప్ స్కోరర్‌గా నిలిచిన విషయం తెలిసిందే.'ఐపీఎల్‌లో విరాట్ ఫామ్ ఎలా ఉందో చూశాం. ముఖ్యంగా సీజన్ రెండో అర్ధ భాగంలో అద్భుతంగా ఆడాడు. అతడు రోహిత్‌తో కలిసి ఓపెనింగ్ చేయాలి. లెఫ్ట్, రైట్ కాంబినేషన్‌లో బ్యాటింగ్ చేయాలని టీవీ వేదికల్లో చర్చిస్తుంటాం. అయితే.. ఉత్తమ ఆటగాళ్లు ఎక్కడ ఆడినా మంచి ప్రదర్శనే చేస్తారు. ఇక జైస్వాల్ టెస్టు సిరీస్ సమయంలోనూ మంచి ఫామ్‌లో లేడు' అని వార్మప్ మ్యాచ్ అనంతరం గావస్కర్ విశ్లేషించాడు. ఈ వార్మప్ మ్యాచ్‌లో టీమ్ఇండియా 60 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. జట్టుతో ఆలస్యంగా కలిసిన విరాట్ కోహ్లీ ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌కు దిగలేదు. జూన్ 5న రోహిత్ సేన ఐర్లాండ్‌తో తన తొలి మ్యాచ్ ఆడనుంది. తుది జట్టులో ఎవరుండేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.